ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 23.10.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఆయిల్ పామ్ సాగుపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈరోజు నుంచి 3 రోజుల పాటు మలేషియా పర్యటిస్తున్నారు.
2. ధైర్య సాహసాలు ప్రదర్శించిన అటవీ శాఖ అధికారులకు ఏటా రాష్ట్రపతి పురస్కారాలు ప్రదానం చేయాలని కోరుతూ కేంద్రానికి అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ లేఖ రాశారు.
3. ఓటరు కార్డులో సవరణలకు ఆన్ లైన్ , ఆఫ్ లైన్ పద్ధతుల్లో దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు.
4. తన పరువుకు భంగం కలిగేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారకరామారావు నోటీసులు పంపారు.

----------------------------

**తుమ్మల మలేషియా**

ఆయిల్ పామ్ సాగుపై అధ్యయనం చేసేందుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మలేషియా కు వెళ్లారు. మూడు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో వివిధ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు. ఆయిల్స్ అండ్ ఫాట్స్ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఎగ్జిబిషన్ ను సందర్శిస్తారు. హార్వెస్టింగ్ టూల్స్ డెమోను అధికారులతో కలసి మంత్రి పరిశీలిస్తారు. అనంతరం కౌలాలంపూర్ లో మలేషియా మంత్రి జోహారీ ఘనీతో సమావేశమవుతారు.

**డెస్క్**

-----------------------------

**కొండా సురేఖ**

ధైర్య సాహసాలు ప్రదర్శించిన అటవీ శాఖ సిబ్బందికి ప్రతి ఏటా రాష్ట్రపతి పురస్కారాలు ప్రదానం చేయాలని కోరుతూ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర అటవీ , పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ కు లేఖ రాశారు. ఈ పురస్కారాలు అటవీ సిబ్బందిలో నైతిక స్థైర్యాన్ని పెంచుతుందని తెలిపారు. అడవులు , వన్యప్రాణుల సంరక్షణకై విలువైన సేవలు అందిస్తున్న వారిని ప్రోత్సహించాలని మంత్రి సురేఖ కోరారు. విధి నిర్వహణలో భాగంగా అటవీ సిబ్బంది ఎన్నో ప్రమాదాలను ఎదుర్కొంటున్నారని , వారి త్యాగాలకు, సేవలకు సరైన గుర్తింపు లభించడం లేదని మంత్రి అన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పోలీసులకు రాష్ట్రస్థాయిలో "పోలీస్ సేవా పతకాలు" అందిస్తున్నట్లుగానే "అటవీ సేవా పతకాలు " అందించాలని మంత్రి సురేఖ ముఖ్యమంత్రికి విన్నవించారు.

**పీఎస్**

--------------------------

**సీఈసీ సుదర్శన్ రెడ్డి**

ఓటరు కార్డులో చిరునామా , పేరు, వయసు తదితర మార్పులకు ఆన్ లైన్ లేదా ఆఫ్ లైన్ పద్ధతుల్లో దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి తెలిపారు. ప్రతి వంద ఇళ్లకు ఒక బీఎల్ఓను నియమించామని , వారిని సంప్రదించి ఓటు నమోదు , ఓటరు కార్డులో సవరణలు చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం 2025 పై ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నిర్వహించిన ప్రత్యక్ష ఫోన్ ఇన్ కార్యక్రమంలో సీఈసీ పాల్గొన్నారు. ఓటరు నమోదు , ఓటు గుర్తింపు కార్డులో సవరణలకు సంబంధించి శ్రోతలు అడిగిన సందేహాలకు సుదర్శన్ రెడ్డి సమాధానాలు ఇచ్చారు. ఈ ఏడాది ఆగస్టు 20 నుంచి ప్రారంభమైన ఓటరు జాబితా సవరణ డిసెంబర్ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే బీఎల్ఓల ద్వారా ఇంటింటి సర్వే పూర్తి చేశామన్నారు.

డెస్క్

----------------------------

**ట్రైయినీ కలెక్టర్లు**

ఐదుగురు సభ్యులతో కూడిన ట్రెయినీ కలెక్టర్ల బృందం ఈ రోజు ఖమ్మం జిల్లాలో పర్యటిస్తోంది. ఏన్కూర్ మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేద్రం, పల్లె దవాఖానా, నర్సరీలను పరిశీలించారు. పాఠశాల వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య తదితర సౌకర్యాల గురించి

ఎంఈవోను అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు ఉదయం నుంచి శాఖల వారీగా పరిశీలన చేస్తూ సంబంధిత అధికారులతో నిర్వహణ తీరుతెన్నులను అడిగి ట్రైనీ కలెక్టర్లు  అడిగి తెలుసుకున్నారు.

**PTC, khammam**

-------------------

**బీజేపీ పర్యటన**

మూసీ తీర ప్రాంతంలో హైడ్రా కూల్చివేతలతో ఇళ్లు కోల్పోయిన వారిని బీజేపీ నాయకులు ఈ రోజు    ,  రేపు పరామర్శిస్తారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రామంతపూర్ లోని బాలకృష్ణా నగర్ లో మూసీ పరివాహక ప్రాంతాన్ని భాజపా ప్రతినిధి బృందం పరిశీలించింది.     మల్కాజీగిరి పార్లమెంట్ సభ్యులు     ఈటల రాజేందర్ నేతృత్వంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే NVSS ప్రభాకర్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు   శిల్పారెడ్డి,  ఇతర నాయకులు అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లను కూల్చివేస్తారనే ప్రచారం జరుగుతోందని, దశాబ్దాలుగా ఇక్కడ నివసిస్తున్నామని తెలిపారు. తమ నివాసాలను ఖాళీ చేయమంటే ఎక్కడికి వెళ్లాలని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులకు అండగా ఉంటామని భాజపా నేతలు హామీ ఇచ్చారు.

**డెస్క్**

-----------------------------------

**రోడ్డు శంకుస్థాపన**

నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో గ్రామాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని నాగనూల్ శివారులో నిర్మించే రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.

**PTC, నాగర్‌కర్నూల్**

--------------------------

కేటీఆర్ లీగల్ నోటీసులు

తన పరువుకు భంగం వాటిల్లేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె తారకరామారావు లీగల్ నోటీసలు పంపారు. వారం రోజుల్లో భేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని నోటీసుల్లో పేర్కొన్నారు. తాను మాదక ద్రవ్యాలు తీసుకుంటానని కేంద్ర మంత్రి బండి సంజయ్ అసత్య ఆరోపణలుచేశారని, అవి నిరాధారమని తారక రామారావు తెలిపారు.

ఈ అంశంపై బండి సంజయ్ స్పందిస్తూ తారకరామారావు తనకు పంపిన లీగల్ నోటీసులకు భయపడేది లేదన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక తనకు లీగల్

నోటీసులు పంపారని అన్నారు. తాను కూడా లీగల్ నోటీసులతోనే సమాధానమిస్తానని తెలిపారు.

**డెస్క్**

-----------------------

**సర్పంచుల దీక్ష**

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తాజా , మాజీ సర్పంచుల జేఏసీ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఆరో రోజుకు చేరుకున్నాయి. జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య మాట్లాడుతూ, తమ పెండింగ్ బిల్లులను చెల్లించే వరకు దీక్ష విరమించబోమని తెలిపారు. అప్పులు చేసి గ్రామాభివృద్ధికి కృషి చేసిన సర్పంచులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయని , పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పీటీసీ రాజన్న సిరిసిల్ల

-------------------------------

**అంబుజా సిమెంట్**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేటలో ఒక సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై ఈరోజు ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంది. ఈ పరిశ్రమ ఏర్పాటు చేస్తే పర్యావరణ సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని ప్రజాసంఘాలు , ప్రతిపక్ష పార్టీ

నాయకులు గత కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ పరిశ్రమను మరో చోటుకి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాభిప్రాయ సేకరణకు బయలుదేరిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య , కంచర్ల భూపాల్ రెడ్డి , గాదరి కిషోర్లను అరెస్టు చేసి మునగోడు పోలీస్ స్టేషన్ కు తరలించారు. బీఆర్ఎస్ నాయకుల అరెస్టును మాజీ మంత్రి , బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె తారకరామారావు ఖండించారు.

**పీటీసీ యాదాద్రి భువనగిరి**

---------------------------

**పోలీసు పతాక**

పోలీసు పతాక దినోత్సవా న్ని పురస్కరించుకొని వనపర్తి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సమన్వయంతో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరంను జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రావుల గిరిధర్ ప్రారంభించారు. పోలీసు అధికారులు,యువకులు రక్తదానం చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గిరిధర్ మాట్లాడుతూ విధి నిర్వహణ లో ప్రాణాలు అర్పించిన పోలీసుల స్మృతితో సేవాకార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

**పిటిసి, వనపర్తి**

---------------------------

**సస్పెన్షన్**

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు నరేందర్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా డీఈవో రమేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఈవో తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు జిల్లా విడిచి వెళ్లొద్దని ఉపాధ్యాయున్ని ఆదేశించారు.

పి టి సి, రాజన్న సిరిసిల్ల జిల్లా

--------------------------

**బాల్య వివాహాలు**

బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాల్యవివాహాల నియంత్రణ , బాలల అక్రమరవాణా, లైంగిక వేధింపులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తండాలు , గూడేలు, గ్రామీణ ప్రాంతాలలో బాల్యవివాహాలను నిర్మూలించేందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**పిటిసి నిర్మల్ జిల్లా**

----------------------------

**బాణాసంచా**

ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా వ్యాపారం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని బాణా సంచా విక్రేతలతో ఈ రోజు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడూతూ బాణాసంచా విక్రయాల్లో భద్రతా ప్రమాణాలను పాటించాలన్నారు. ముందస్తు అనుమతులు తీసుకున్న తర్వాతే విక్రయాలు ప్రారంభించాలన్నారు.

**పీటీసీ, వరంగల్**

---------------------------

**రక్తదాన శిబిరం**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకొని ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ DV శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 21 నుండి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని దీనిలో భాగంగా రేపు నిర్వహిస్తున్న శిబిరంలో రక్తదానం చేయాలని సిబ్బంది, ప్రజలను కోరారు.

**పీటీసీ, ఆసిఫాబాద్**

----------------------